ప్రజాశక్తి

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

5

విజయనగరం

నైపుణ్య మెరుగుదలకు సదస్సు తోడ్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు అవగాహన సదస్సు తోడ్పడుతుందని జెఎన్‌టియు జివి వైస్‌ఛాన్సలర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. యూనివర్శిటీలో గురువారం వన్ డే ఓరియంటేషన్ ప్రోగ్రాం ఆన్ బిసిడిఇ యాక్టివిటీస్ అండ్ బెనిఫిట్స్ అనే కార్యక్రమం రాష్ట్రప్రభుత్వం,జెఎన్‌టియుజివి ఆధ్వర్యాన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య పాల్గొని మాట్లాడుతూ సాంకేతిక రంగం పట్ల యువత పట్టు సాధించాలన్నారు. అతిథిగా విచ్చేసిన బిసిడిఇ సిఇఒ ప్రొఫెసర్ దేవకుమార్ మాట్లాడుతూ బి సి డి ఇ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, బిసిడిఇ యూనివర్సిటీ కోఆర్డినేటర్ జిజె నాగరాజు, యూనివర్సిటీ కాలేజ్ కోఆర్డినేటర్, అనుబంధ కళాశాలల బి సి డి ఇ కోఆర్డినేటర్లు, అంబాసిడర్లు, స్టోర్లు పాల్గొన్నారు.

నేడు గ్రామీణ భారత్ బంద్

- మోడీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సమర శంఖం
- నేడు నగరంలో రైతు కార్మిక సంఘాల భారీ ప్రదర్శన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మిక వ్యతిరేక విధానాలపై శుక్రవారం గ్రామీణ భారత్ బంద్ చేపట్టేందుకు జిల్లాలో ఉన్న కార్మిక,రైతు సంఘాలు సిద్ధమయ్యాయి. మరోవైపు కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు వారంతా సమ్మె చేయనున్నారు. బంద్, సమ్మెను జయప్రదం చేసేదుకు ఇప్పటికే జిల్లాలో అనేక సమావేశాలు పెట్టి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగించింది. వ్యవసాయం, పరిశ్రమలు గనులు విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర సంస్థలన్నిటినీ అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోంది. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లు తెచ్చింది. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించినా జీవోలు ఇవ్వకపోగా, మరో రూపంలో వాటిని అమలుపరచేందుకు చూస్తోంది. విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టింది. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం సామాన్య ప్రజల నిత్యవసర వస్తువులన్నింటిపైనా జిఎస్‌టి పేరిట పన్నులు పెంచి అన్ని రకాల ధరలను పెంచి సామాన్యులపై మోయలేని భారాలు వేసింది. గత పదేళ్లలో బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు లక్షా యాభైవేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.

బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి మరింత ద్రోహం చేసింది. ప్రత్యేక హోదాను నిరాకరించింది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితులు నష్టపరిహారం, పురావాసం తనకు సంబంధం లేదంటుంది. రైల్వే జోన్ ఎగనామం పెట్టింది. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టింది. రాజధాని నిర్మాణానికి పట్టెడు మట్టితో సరిపెట్టింది.

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తోంది. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది. రాష్ట్రాల హక్కులను హరించి వేస్తుంది. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు, కార్మిక ప్రజా అనుకూల విధానాలకై పోరాడాలని, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చాలు పిలుపు ఇచ్చాయి.

ఈ నేపథ్యంలో శుక్రవారం దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహించాలని, పరిశ్రమల అన్నింటిలో కార్మిక సమ్మె జరపాలని నిర్ణయించారు.

అన్ని రైతు , కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినిమోగదారుల సంఘాలు, వృత్తి సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా, సాంస్కృతిక సంఘాలు గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఇప్పటికే పిలుపునిచ్చాయి.

ఇవీ డిమాండ్లు

- ☞ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి. రైతు రుణాలు మాఫీ చేయాలి.
- ☞ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి
- ☞ ఉపాధిహామీకి కేంద్ర బడ్జెట్లో రూ. 2లక్షల కోట్లు కేటాయించి, 200 రోజులకు పెంచాలి. వేతనం రూ.600కు పెంచాలి. 2 పూటల పని, ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలి.
- ☞ ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలి.
- ☞ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి
- ☞ విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలి, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలి.
- ☞ భూహక్కుల చట్టం 27/23 ను ఉపసంహరించాలి.
- ☞ చుక్కలభూములు, బంజరు భూములున్నింటికీ పట్టాలు ఇవ్వాలి.
- ☞ రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా సమగ్ర పంటల బీమా పథకం పెట్టాలి. సాగులో ఉన్న కౌలు రైతులకే నష్టపరిహారాలు, బీమా సౌకర్యం ఇవ్వాలి.
- ☞ అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలి. ఆదివాసుల హక్కులను కాపాడాలి.
- ☞ బంద్‌లో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన,కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లాలో ఉన్న రైతు సంఘాలు,కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ బంద్ లో కర్షకులు,కార్మికులు పాల్గొననున్నారు.

రెండో రోజూ నిరసనలు

ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని ఉద్యోగుల డిమాండ్

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎపి జెఎసి అధ్వర్యంలో నల్ల రిబ్బన్లు కట్టుకొని కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి రమణ మాట్లాడుతూ రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు లంచ్ అవర్‌లో జెఎసి భాగ్యస్వామ్య పక్ష ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ఐ అర్ 30 శాతం, పెండింగ్ డిఎలు, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈనెల 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, 20న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా 27న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. జెఎసి జిల్లా నాయకులు సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ , పింఛనుదార్ల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మురళి, రాంబాబు, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు వై ఆనంద్ కుమార్, ఎన్జీవో జిల్లా,పట్టణ కార్యవర్గ సభ్యులు నాయకులు నీలాద్రి నాయుడు, శ్రీధర్ బాబు,తవుడు,అప్పలనాయుడు విద్యాశాఖ వ్యవసాయ శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ నాయకులు మహిళా విభాగం అదిలక్ష్మి ,శ్రీ విద్య, స్వప్న పాల్గొన్నారు.

బొబ్బిలి : ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన 25 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని జెఎసి నాయకులు జె.సి.రాజు డిమాండ్ చేశారు. బొబ్బిలి తాలూకా జెఎసి కార్యదర్శి జి.రామారావు ఆధ్వర్యంలో గురువారం భోజన విరామ సమయంలో స్థానిక ఇరిగేషన్ ఎస్ఇ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. 17న తాలూకా కేంద్రాల్లో నిర్వహించనున్న ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని జెఎసి నాయకులు జి.రామారావు కోరారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఎం.సురేష్‌కుమార్, సతీష్ కుమార్, శ్రీలత, జెఎసి నాయకులు బంకురు ప్రసాద్, చుక్క శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో రోజు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. భోగాపురం తాలుకా యూనిట్ పరిధిలో డెంకాడ ఎంపిపి కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు, అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్, ఉద్యోగ ప్రతినిధులు కె. గురుభక్తులు, కె యేసయ్య.. సీత రాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉచిత విద్యుత్తు : ఎస్ఇ

విజయనగరం టౌన్ : ఉమ్మడి జిల్లాలో బిపిఎల్ కింద ఉన్న గిరిజనులకు ప్రధానమంత్రి జన్‌మాన్ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1399 గిరిజన గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎవరికైనా ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోతే సంబంధిత ఎఇ (సెక్షన్) కార్యాలయంలో కుల సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు,జెరాక్స్‌లు ఇస్తే వాటిని పరిశీలించి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు విజయనగరంలో శంఖారావం సభ

విజయనగరంకోట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం సభ శుక్రవారం విజయనగరంలోని రింగ్‌రోడ్డులో జరుగనుంది. ఈ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు కోరారు. గురువారం సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ దగ్గరలోని గ్రౌండ్‌లో ఏర్పాటుచేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఐవిపి రాజు, పి.లక్ష్మీ వరప్రసాద్, బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, రాజేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

చేసిన మంచిని ప్రజలకు వివరించండి

వాలంటీర్లకు కోలగట్ల పిలుపు ● 10,284 మందికి సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వాలంటీర్లకు పిలుపునిచ్చారు. జిల్లాలోని 10,284 మంది వాలంటీర్లను సేవా పురస్కారాలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పురస్కార ప్రదానోత్సవాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ప్రారంభించారు. దీనిలో భాగంగా జిల్లాలోని 35 మంది వాలంటీర్లకు సేవా వజ్ర, 159 మందికి సేవా రత్న, 10,090 మందికి సేవా మిత్ర పురస్కారాలను ప్రకటించారు. సేవా వజ్రలకు రూ.45 వేలు, సేవా రత్నాలకు రూ.30 వేలు, సేవా మిత్రులకు రూ.15 వేలు చొప్పున నగదు పురస్కారాన్ని, ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్ అందజేసి, శాలువాలతో సత్కరించారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్న వాలంటీర్ల సత్కార కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ వాలంటీర్లు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. వారి సేవలకు గుర్తింపుగా ఈ చిరు సత్కారాన్ని చేస్తున్నామన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందడానికి, ప్రభుత్వానికి మంచి పేరు రావడానికి వాలంటీర్లే కారణమని అభినందించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకు తింటే, తమ ప్రభుత్వ హయాంలో వాలంటీర్లు ముఖ్యమంత్రి గౌరవాన్ని పెంచారని చెప్పారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఒక కేలండర్ ప్రకారం నిర్ణీత సమయానికి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న ఘనత వాలంటీర్లదేనని అభినందించారు. విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ వాలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.డి.అనిత, జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి, కో-ఆర్డినేటర్ అశోక్, ఆ శాఖ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్

శాస్త్ర విజ్ఞానం పెంపొందించేందుకు ప్రదర్శన తోడ్పాటు : ఎమ్‌పి బెల్లాన, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ప్రాజెక్టు గురించి ఆరా తీస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం పూల్‌బాగ్‌లో చలపతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంబించారు. ముందుగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ ప్రారంభోపన్యాసం చేస్తూ ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయిలో 2022-23 సంవత్సరంలో మంజూరైన 120 ప్రాజెక్టులు, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 60 ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నట్లు తెలిపారు. వీటిలో పది శాతం ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికవుతాయని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలిపారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లలో పాల్గొనడం ద్వారా, ఎన్నో కొత్త విషయాలు నేర్చుకొని, శాస్త్రీయ ఆలోచనలను జోడిస్తూ, అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ న్యూఢిల్లీ నుంచి డాక్టర్ కె. మహిమ పరిశీలకులుగా పాల్గొన్నారు, డిసిఇబి సెక్రటరీ సన్యాసి రాజు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎం.కృష్ణారావు, వివిధ పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలు దగా

- బొత్స, బెల్లాన పట్టించుకోలేదు
- మాయమాటలు నమ్మితే మరింత దోపిడీ
- శంఖారావం సభల్లో లోకేష్

సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

శంఖారావం సభలో పాల్గొన్న జనం

ప్రజాశక్తి-రేగిడి, చీపురుపల్లి

వైసిపి పాలనలో ప్రజానీకం దగాపడ్డారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఈ జిల్లాను మంత్రి బొత్స, ఎంపి బెల్లాన పట్టించుకోలేదని విమర్శించారు. టిడిపి చేపట్టిన శంఖారావంలో భాగంగా రాజాం, చీపురుపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సభల్లో లోకేష్ మాట్లాడారు. ఉత్తరాంధ్రకు పట్టిన దరిద్రం జగన్ అని, మూడు రాజధానుల పేరిట మూడుముక్కలాట ఆడుతున్నారని అన్నారు. వైవి సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, విజయసాయిరెడ్డి కుటుంబాలకు ఉత్తరాంధ్రను అప్పగించారని, ఈ మూడు కుటుంబాలు ఏం పీకాయని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రకు పరిశ్రమలు తెచ్చారా? ఇళ్లు నిర్మించారా? నీళ్లు ఇచ్చారా? రోడ్లు వేశారా? అంటూ ప్రశ్నించారు. పాదయాత్రలో జగన్ ఈ జిల్లాకు 50 హామీలిచ్చినా ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు.

జిల్లాలో పరిశ్రమలు మూతపడినా ఇక్కడి పాలకులకు పట్టడం లేదన్నారు. రహదారులు స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్నాయని అన్నారు. పాలిచ్చే ఆవును కాదని..తన్నే దున్నపోతును ప్రజలు తెచ్చుకున్నారని అన్నారు. సీనియర్ నేత అయిన మంత్రి బొత్స జగన్‌ను ఎందుకు అభివృద్ధిపై నిలదీయడం లేదన్నారు. దీనికి కారణం ఆయన చేసే అవినీతి అని, ఆయన పెన్నులోని ఇంకు అవినీతికి వాడుతున్నాడు తప్ప అభివృద్ధికి కాదని విమర్శించారు. 5 ఏళ్లుగా ఇక్కడి ప్రజలకు ఒక్క మంచిపనైనా బొత్స చేశారా అని ప్రశ్నించారు. రైల్వే బ్రిడ్జి పనులు ఆగిపోయినా రాష్ట్ర నిధులు ఇవ్వలేదని, దీనిపై బొత్స ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని అన్నారు. బొత్స కుటుంబం విజయనగరానికి కేన్సర్ గడ్డలా పట్టుకుందని, ఈ గడ్డ పోవాలంటే రేడియేషన్ చేయాలని, ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో బటన్ నొక్కి రేడియేషన్ ఇవ్వాలని అన్నారు. ఆర్ఇసిఎస్‌ను ఎందుకు ప్రభుత్వంలో విలీనం చేశారని, రిటైర్డ్ ఎక్స్‌సర్వీస్ భూములు, పేదల భూములు ఎందుకు కబ్జా చేశారని ఆరోపించారు. వీరిమాయమాటలు నమ్మితే ఇంటి పైకప్పు కూడా దోచుకుంటారని, ఈ కుటుంబాన్ని ఏకంగా ఇప్పుడు వైజాగ్‌కు పంపుతున్నారని, అక్కడా దోపిడీకి సిద్ధమవుతున్నారని అన్నారు. ఇక్కడి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్..జిల్లా కోసం పార్లమెంట్‌లో ఏం చేశారు ప్రశ్నించారు. కనీసం రైల్వే బ్రిడ్జి పూర్తి చేయలేని దద్దమ్మ మనకు అవసరమా? అంటూ ప్రశ్నించారు. అభివృద్ధి చేయని పాలకులు మనకు వద్దని, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలకు పలు హామీలు ఇచ్చారు.

కోండ్రు మురళి

రాజాంలో సభకు అధ్యక్షత వహించిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలను ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బటన్ నొక్కుడు పేరుతో హడావుడి చేస్తూ ధరలు, పన్నుల బాదుడు, ఛార్జీల మోతతో పేదల గొంతు నొక్కుతున్నారని అన్నారు. మాయమాటలతో నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. అనంతరం వైసిపి నుంచి టిడిపిలోకి పలువురు చేరారు. వారికి లోకేష్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పెనుబాక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చీడి జగన్నాథం. పొట్నూరు గోపి, బండి లక్ష్మి నారాయణ, రాజాం పట్టణానికి చెందిన వైసిపి నాయకులు కుప్పిలి శ్రీనివాసరావు, పోలిశెట్టి రాము. లంకలపల్లి అప్పన్న. గార్లంకి బాలు.కెంబులు తదితరులు టిడిపిలో చేరారు.

కిమిడి నాగార్జున

చీపురుపల్లి సభలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడుతూ జగన్ సంక్షేమం పేరుతో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. రాముడి తల ఏమైందని ప్రశ్నిస్తే కళావెంకట్రావుపైన, అక్రమాలను ప్రశ్నించినందుకు అచ్చెన్నాయుడుపై కేసులు బనాయించారని, తప్పుడుకేసులతో నోరునొక్కాలని చూశారని అన్నారు. బొత్స సత్యనారాయణను మించి అవినీతిపరుడు ఈ రాష్ట్రంలో లేడని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాల్లో చీపురుపల్లికి ఏంచేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఇసిఎస్‌ను నిర్వీర్యం చేశారన్నారు. తోటపల్లిని అసంపూర్తిగా నిలిపివేయడంపై ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని అన్నారు. ఈ సభల్లో ఆయా నియోజకవర్గాల జనసేన సమన్వయ కర్తలు శ్రీనివాసరావు, వై.రాజు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

వినతి అందిస్తున్న టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు

రాజాం, చీపురుపల్లి సభల్లో పలువురు తమసమస్యలను లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్యశాఖలో 21ఏళ్లగా ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ మేల్ పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు, చేనేతను ఆదుకోవాలని కార్మికులు, తెలగ కులస్తులను బిసిలో చేర్చాలని ఆ సామాజికవర్గం, పూర్తి స్థాయిలో డిఎస్‌సి నిర్వహించి ఆదుకోవాలని టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు వినతులు ఇచ్చారు.

మిమ్స్ ఉద్యోగులకు సిఐటియు అండ

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

మిమ్స్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ స్పష్టం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్‌ఒబి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగులు, కార్మికులు గత 15 రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని గురువారం ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం నియంతృత్వ దోరణితో ఉద్యోగులకు డిఎ బకాయిలు చెల్లించకుండా, వేతన ఒప్పందం చేయకుండా వారిని వేధింపులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా సేవలు అందించిన ఉద్యోగులు, కార్మికులకు వారి బాగోగులు చూడాల్సిన యాజమాన్యం సమస్యలు పరిష్కరించాలని అడిగితే సస్పెన్స్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మిమ్స్ యాజమాన్యం కొండను ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తున్నా అడిగేవారు లేరని, మిమ్స్‌లో నాటి బ్రిటీష్ పాలన తలపించేలాఉద్యోగులు, కార్మికులను కట్టు బానిసలుగా చూడడం తగదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం డిఎ బకాయిల చెల్లించి వేతన ఒప్పందం చేసి సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ఉండాలని సిఐటియు అండగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్య నారాయణ, జిల్లా ప్రధాకార్యదర్శి కె.సురేశ్, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి.రమణ, సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. గురువారం ఆయన నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు సమస్యల వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. రెండు మూడు రోజుల్లో మిమ్స్ యాజమాన్యంతో మాట్లాడి చర్చలు జరిపి న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం పరిశీలకులు అందవరపు సూరిబాబు, జడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, నాయకులు చిక్కాల సాంబశివరావు, సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, డి.గిరిబాబు, పతివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై
లోకేష్ సమాధానం చెప్పాలి : బొత్స

ప్రజాశక్తి-గజపతినగరం

తెలుగు తమ్ముళ్లు అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక గురించి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు బుధవారం అర్ధరాత్రి గరుడబిల్లి సమీపంలో మట్టి, ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారంటూ జెసిబిని, ట్రాక్టర్‌ను పట్టుకున్నారని వివరించారు. వాటిని పోలీసులకు సైతం అప్పగించారని తెలిపారు. ఈ అక్రమ రవాణాలో ఎమ్మెల్యేగా తన హస్తముందని వీడియో రూపంలో రిలీజ్ చేశారని అన్నారు. తీరా చూస్తే అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు తెలుగు తమ్ముళ్లవేనని తెలిసి కంగుతిన్నారని చెప్పారు. టిడిపికి చెందిన కొండకరకం గ్రామస్తులు సత్తిబాబు అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులేనంటూ ఆధారాలతో సహా ఆయన వివరించారు. లోకేష్ పర్యటన సందర్భంగా ఆయన వద్ద మార్కులు కొట్టేసేందుకే అర్ధరాత్రి ఈ ఇసుక రవాణా అంటూ హడావుడి చేశారని ఎద్దేవా చేశారు.

ఉపాధి శిక్షణ కోర్సులను ప్రారంభిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

ఉపాధి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గొంప క్రిష్ణ విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ గురువారం ప్రారంభించారు, ఈ కోర్సుల శిక్షణ కోసం మొత్తం 388 రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో టైలరింగ్‌కు 110 మందిని, బ్యూటీషియన్ కోర్సుకు 25 మందిని ఎంపిక చేశారు. వీరికి 3 నెలల పాటు న్యూ లైఫ్ అనే సంస్థ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు క్రిష్ణ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లగుడు రవికుమార్, రాయవరపు చంద్రశేఖర్, రెడ్డి పైడిబాబు, గుమ్మడి భారతి, జుత్తాడ రామసత్యం, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమా మహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాసరావు, మండా త్రినాథ్, ముక్క రామకృష్ణ, కిలపర్తి హరి పాల్గొన్నారు.

సమ్మె ఒప్పంద జిఒలు ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులు సమ్మె ఒప్పంద జిఒలు తక్షణమే ఇవ్వాలని కార్పొరేషన్ మేనేజర్ టిఎల్‌విఎస్ ప్రసాద్‌కి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జగన్మోహనరావు, బి.భాస్కరరావు గురువారం వినతి అందించారు. కార్మికులకు 2 నెలలు హెల్త్ అలవెన్స్, పంప్ హౌస్, ప్లాంటేషన్ కార్మికులకు 2 నుంచి 6 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. సమ్మె కాలపు జీతం, సంక్రాంతి కానుక రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి బకాయిలు చెల్లించడం లేదని, యూనిఫాం కుట్టుకూలి ఇవ్వలేదని చెప్పారు. వీటిపై ప్రభుత్వం, అధికారుల తక్షణమే స్పందించకపోతే ఈ నెల 20న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు రజిని, సూరి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రెల్లిలో జెసి పర్యటన

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని రెల్లి గ్రామంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ గురువారం పర్యటించారు. అక్కడి భూములను పరిశీలించారు. ఎపిఐఐసికి కేటాయించిన 156 ఎకరాల అలినేషన్ వివరాలను, రికార్డులను రెవిన్యూ అధికారులను అడిగి తనిఖీ చేశారు. జెసి వెంట హెచ్‌డిటి రమేష్, తదితరులు ఉన్నారు.

వివరాలు ఆరాతీస్తున్న జెసి కార్తీక్

రహదారులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 44, 46 డివిజన్లలో రూ.21.30 లక్షలతో నిర్మించిన సిసి రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసిపి డివిజన్ ఇన్చార్జి లంక మహేష్, జోనల్ ఇన్చార్జి తమ్ము, 46వ డివిజన్ కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ, బొద్దూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని రాతిపనివారివీధి, నాగశపువీధి, కోరాడవీధి, టిఆర్ కాలనీలో గురువారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. తారకరామకాలనీలో సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.

ఒహెచ్‌ఆర్‌తో స్వచ్ఛమైన తాగునీరు

ప్రజాశక్తి-వేపాడ

ఒహెచ్‌ఆర్‌తో శుభ్రం చేయడం వల్ల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని సింగరాయి సర్పంచ్ ఎన్.వెంకటరావు తెలిపారు. మండలంలోని సింగరాయి గ్రామంలో ఒహెచ్‌ఆర్‌తో తాగునీటిని శుభ్రం చేయడంపై ఆయన అవగాహన కల్పించారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు.

బాల్య వివాహాల నివారణపై కళాజాతా

ప్రజాశక్తి - జామి

బాల్య వివాహాల నివారణ, ఆడపిల్లలను కాపాడుదామన్న అంశంపై అంబేద్కర్ కళాజాతా బృందం బుర్రకథ రూపంలో అవగాహన కల్పించింది. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జామి మండల కేంద్రమైన మాధవరాయ మెట్ట కాలనీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, చిన్నారులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చిన్నతనంలో వివాహాలు నివారించడం సమాజానికి మంచిదన్న అంశాలను కళాజాతా ద్వారా వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సునీత, వైకెపి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ : అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై కళాజాతా బృందం వేపాడలో గురువారం అవగాహన కల్పించింది. బుర్రకథ రూపంలో మహిళలకు వివరించింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కామేశ్వరి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి- రేగిడి

విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఎంఇఒ ఎం. వరప్రసాదరావు సూచించారు. ఈ మేరకు గురువారం పారంపేట, కాగితాపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై అడిగి తెలుసుకున్నారు. వెనుక పడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సమయాలను పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టి తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులు ధర్నాన రామారావును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో పాఠశాలలో మౌలిక వసతులు కూడా పర్యవేక్షించి ప్రధానోపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు అందించారు.

బిజెపి విధానాలను ప్రతిఘటిద్దాం

- నేడు గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయండి
- కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు
- నగరంలో బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, రైతుసంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మోడీ కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే రైతాంగ, కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం సిఐటియు, ఎఐటియుసి, ఎఐకెఎస్ కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ మూడులాంతర్లు, గంట స్థంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, ఎన్‌సిఎస్, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు పూదోట ప్రకాష్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బరావమ్మ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు మొదిలి శ్రీనువాసరావు మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాడని, కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తూ దేశానికి తీవ్రతరమైన నష్టం కలిగిస్తున్నాడని అన్నారు. మరోవైపు తమ పంటలకు చట్టబద్ధమైన కనీసం మద్దతు ధరను ప్రకటించాలని, విద్యుత్ చట్టాలను ఉపసంహరించుకోవాలని, 60 సంవత్సరాల పైబడిన వ్యవసాయ కూలీలకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న రైతాంగంపై మోడీ ఉక్కు పాదం మోపుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. గతంలో మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారని తెలిపారవు. ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా ప్రజలను మోడీ మోసం చేస్తున్నాడని అన్నారు. బిజెపికి తగిన విధంగా బుద్ధి చెప్పాలంటే ఈనెల 16న జరుగుతున్న రైతాంగ కార్మిక సమ్మెలో రైతులు, కార్మికులు, యువకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, ఎ.జగన్మోహన్, బి. రమణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఐఎన్‌టియుసి నాయకులు శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

కొత్తవలస : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై శుక్రవారం చేపట్టే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉపాధి హామీ పనిప్రాంతాల్లో కూలీలకు కరపత్రాలను పంపిణీ చేసి, ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను మోడీ ప్రభుత్వం అమలు చేయకుండా మోసగించిందని తెలిపారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా, మరొక రూపంలో వాటిని అమలు చేసేందుకు చూస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్తు చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నెల్లిమర్ల : దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని వామ పక్ష ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ఐఎఫ్‌టియు నాయకులు కిల్లంపల్లి రామారావు, కాళ్ల అప్పల సూరి గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కొత్తవలస.. ఉపాధి పని ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్న వ్యకాస జిల్లా అధ్యక్షులు గాడు అప్పారావు

బూటకపు హామీలను నమ్మొద్దు

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు



బాడంగి.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

బూటకపు హామీలు ఇచ్చి రానున్న ఎన్నికల్లో లబ్దిపొందేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని, వాటిని నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రజలను కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. మరోసారి బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేసిన వైసిపిని గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో టిడిపి-జనసేన కుట్రలను తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, తమ్మిరెడ్డి దామోదర్, పట్టణ, మండల అధ్యక్షులు చోడిగంజి రమేష్, యు.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి వీణ ఆవిష్కరణ

బొబ్బిలి మున్సిపల్ కార్యాలయ సుందరీకరణలో భాగంగా ఈ ప్రాంతానికే ప్రసిద్ధి గాంచిన బొబ్బిలి వీణను కార్యాలయంలో ఏర్పాటుచేశారు. గురువారం ఆ వీణను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆవిష్కరించారు. అనంతరం జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి మున్సిపాలిటీకి మంజూరైన తడి, పొడి చెత్త వాహనాలు ఆయన ప్రారంభించారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

బాడంగి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లాది గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ దార్శనికత వల్లే నేడు సామాజిక న్యాయం లభించిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను సాకారం చేసేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎక్కడా లేని విధంగా సామాజిక న్యాయం చేస్తున్నారని తెలిపారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, వేదాంత డెవలపర్స్ ఎమ్‌డి కోట సురేష్, నాయకులు బేతనపల్లి శంకర్రావు, మాజీ సర్పంచ్ కురిటి సూర్యనారాయణ, తెంటు మధు, గర్భాపు స్వామినాయుడు, సోరు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వ్యాగన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రైల్వేస్టేషన్లో ఉన్న వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. వేణుగోపాల్.. రైల్వే డిఆర్ఎంను కోరారు. స్థానిక రైల్వేస్టేషన్‌ను గురువారం డిఆర్ఎం సర్వా ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్ఎంను వారు కలిసి సమస్యను వివరించారు. వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలిస్తే కళాసీలు, లారీ ఓనర్స్, కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు. అనంతరం ప్లాట్‌ఫాంను డిఆర్ఎం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయనతో రైల్వే అధికారులు ఉన్నారు. మల్లమ్మపేటలోని ద్వారకానగర్ నుంచి రైల్వే క్వార్టర్స్ మీదుగా రహదారి సౌకర్యం కల్పించాలని కౌన్సిలర్ లక్ష్మి, టిడిపి నాయకులు కె.సత్యనారాయణ డిఆర్ఎంకు వినతి అందించారు. ద్వారకానగర్, రైల్వేక్వార్టర్స్‌కు మధ్య ఏర్పాటుచేసిన గోడను తొలగించాలని కోరారు.

డిఆర్ఎంకు వినతి అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

'జనసేన-టిడిపి కూటమితోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - భోగాపురం

జనసేన టిడిపి కూటమితోనే నెల్లిమర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ లోకం మాధవి అన్నారు. భోగాపురం పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన వారు జనసేన పార్టీలో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసారి జరిగే ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమి కచ్చితంగా గెలుస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం తీరుతో ప్రజలంతా విసిగిపోయి ఉన్నారన్నారు. అందుకే చాలా మంది జనసేనలో చేరుతున్నారని గుర్తు చేశారు. అనంతరం నెల్లిమర్ల మండలంలోని ఆల్తిపాలెం, రామతీర్థం, పూసపాటిరేగ మండలంలోని చల్లవాని తోట, గోవిందపురం, డెంకాడ మండలంలోని రాజుల తమ్మాపురం గ్రామానికి చెందిన సుమారు 90 కుటుంబాలు ఆయా పార్టీలను వీడి జనసేన పార్టీలో చేరాయి. వీరందరికీ లోకం మాధవి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, కరుముజ్జి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో లోకం మాధవి

ఘనంగా లోకం మాధవి జన్మదిన వేడుకలు

లోకం మాధవి జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వారి మధ్య కేకును కట్ చేశారు.

రేవళ్లపాలెంలో ఎమ్మెల్యే పర్యటన

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని రేవళ్లపాలెంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన కొట్టాంలో కోటమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాలన అందించారని తెలిపారు.

ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు అమలు చేశారని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఫోక్, కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు రెహమాన్, పోతనాపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, కొట్టం శానాపతి చంద్రరావు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి వాకాడ సతీష్, ఆలుగుబిల్లి కాశీ, వి. సోంబాబు, జాగారపు రామకృష్ణ, ఎంపిటిసి చప్ప లత, చప్ప భాస్కర్, తలారి అనంత్, తదితరులు పాల్గొన్నారు.

కళాజాతాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా శాఖ ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కోసం చేపట్టిన జాతాలను గురువారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఈ నెల 16 నుంచి రోజుకు నాలుగు కళాజాతా బృందాలతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిడ్స్ పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్. సూర్యనారాయణ, సిబ్బంది, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

కళాజాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

శంఖారావం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం జంక్షన్ వద్ద ప్రయివేటు లేఅవుట్‌లో శనివారం నిర్వహించే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కోరారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. శంఖారావం సభకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గొంప వెంకటరావు

డెంకాడ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నెల్లిమర్ల మండలంలోని రామతీర్థం ప్రకృతి లేఅవుట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శంఖారావం సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. సభ ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందని డెంకాడ మండల టిడిపి నాయకులు, క్లస్టర్ ఇంఛార్జిలు, యూనిట్ ఇంఛార్జిలు, భూత్ ఇంఛార్జిలు, కుటుంబ సాధికార సారథులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉమ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఒ ఉమ గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని తెలిపారు. ఈ పనులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.బాల భాస్కరరావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ గొర్లె రాంబాబు పాల్గొన్నారు.

నేడు బైక్ వేలం

ప్రజాశక్తి-వేపాడ

గతంలో హీరో హోండా బైక్‌ను శుక్రవారం వేలం వేస్తామని వల్లంపూడి ఎస్ఐ కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జామి పోలీసుస్టేషన్ వద్ద నిర్వహించే వేలంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని కోరారు.

మమ్మల్ని గుర్తించండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఉన్న యాదవులను గుర్తించి తగు ప్రాధాన్యత కల్పించాలని యాదవ సంఘం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బిసపు సాయికిరణ్ కోరారు. తమకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని కోరుతూ గురువారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులకు వినతినిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అసెంబ్లీ స్థానాన్ని అన్ని పార్టీలూ యాదవులకే కేటాయించాలని నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు యాదవులకు ఏ పార్టీ అయితే టికెట్ ఇస్తుందో ఆ పార్టీని మూకుమ్మడిగా గెలిపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. లేదంటే ఎన్నికలను ప్రభావితం చేయడానికి యాదవులంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారురు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి . గణేష్, సతీష్, భరత్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బేబినాయన

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-బొబ్బిలి

తెర్లాం మండలం నందబలగ, చిననందబలగ, చినశివడవలస గ్రామాలకు చెందిన 80 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. మాజీ సర్పంచ్ వంజల ఆనంద్, కాగాన కృష్ణ, వై.విజయరావు, ఆనంద్, ప్రకాశం, నూకయ్య, తదితరులు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెర్లాం మండలంలో టిడిపికి అత్యధిక మెజారిటీ రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్.వెంకటనాయుడు, ఎన్.వెంకటేష్, వి.సత్యనారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE :CITY CIVIL COURTS AT HYDERABAD, TELANGANA
O.S.NO. 1589 OF 2022
BETWEEN:
M/S AUROBINDO PHARMA LTD
... PLAINTIFF
AND
B. JAGADESH & OTHERS
... DEFENDANTS
TO
1) K. ESWARA RAO, S/O. K. SATYAM
JAMI - (VILLAGE AND MANDAL)
VIZIANAGARAM DIST - AP- 535215
DEFENDANT NO.3
Whereas the Plaintiff Company filed the above suit against you for recovery of damages/money. The above suit is posted to 07-03-2024 for your appearance. You are hereby summoned to appear either in preson or through your pleader with your defense if any at 10:30 A.M. on the above said date before the Hon'nble Court, failing which the suit will be heard and determined exparte.
(BY ORDER OF THE HON'BLE COURT)
K. VENUGOPAL REDDY
K. NARASIMHA REDDY
Advocates
#Flat No. B:- 209, B-Block, Gayathri Nagar, Allapur, Hyd - 500114